

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గ్లో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (18)*

## *(అనుమతి పాట్లు **బెర్లిన్‌లో నేను, నా కుటుంబం**)*

*నగరవిహారం*

24 గంటలపాటు తూర్పు బెర్లిన్లో గడపడానికి ప్రత్యేక అనుమతి అక్కర్లేదు.

ఒకరోజు ఉదయం ఎవరింట్లో వాళ్లు భోజనాలు చేసి, ఎవరికి అనువైన ఫలహారాలు వాళ్లు తయారు చేసి – పిక్నిక్ సరంజామాతో మేమూ, ప్రసాద్ దంపతులూ తూర్పు బెర్లిన్ యాత్రకి బయల్దేరాం.

అక్కడికి చేరుకుందుకు ఊబాన్లు (అండర్‌గ్రౌండ్ మెట్రోలు) ఉన్నాయి.

మేము దిగాల్సిన స్టేషన్ ఫ్రీడ్రిచ్ స్ట్రాసే. ఊబాన్లో వెడుతూ చాలా సార్లు ఆ స్టేషన్ క్రాస్ చేశాం. ఈసారి అక్కడ దిగాం.

తూర్పు బెర్లిన్‌కి వీసా అక్కర్లేకపోయినా, అది వేరే దేశంలో ఉంది కాబట్టి, ప్లాట్‌ఫాం దాటి బయటకు వెళ్లాలంటే పాస్‌పోర్టులు చూపాల్సి ఉంది.

అక్కడో చిక్కొచ్చింది.

మమ్మల్నీ, ప్రసాద్ భార్యనీ వెళ్లొచ్చన్నారు కానీ – ప్రసాద్‌ని అనుమతించలేదు. ఎందుకంటే ఫొటోలో అతడికి చక్కటి క్రాపుంది. ప్రస్తుతం అతడికి నున్నటి గుండుమీద సన్నగా మొలలు వస్తున్నాయి.

పాస్‌పోర్టులో ఫొటో అతడిది కాదని వాళ్లంటారు.

జరిగిందేమిటంటే – పాస్‌పోర్టు తీసుకున్నాక, జర్మనీ వచ్చేముందు ప్రసాద్ తిరుపతి వెళ్లి గుండు చేయించుకున్నాడు. జుట్టింకా పూర్తిగా రాలేదు.

ఆ విషయం చెబితే, ‘‘క్రాపు చేయించుకుంటే ఓకే. కానీ గుండెందుకు చేయించుకున్నావ్?’’ అన్నాడు అక్కడి అధికారి అనుమానంగా.

అప్పుడు నేను కలగజేసుకుని. ‘‘అదొక ఇండియన్ కస్టమ్!’’ అన్నాను.

ఇండియన్సు అన్న పేరు వింటూనే, ఆ అధికారి ఉలిక్కిపడి, ‘‘ఔనూ, మీరు ఇండియన్సు కదూ! ఇండియన్స్ కెన్ బి ట్రస్టెడ్!’’ అని అతణ్ణి కూడా వదిలేశాడు.

స్వదేశంలోనే మన పౌరులకింత గౌరవం లేదు. మన నియమాలన్నీ పౌరులమీద అనుమానంతో పుట్టి, అడుగడుగునా సామాన్యుణ్ణి వేధించేవే!

ఆ అధికారి మాటలతో నాకు ఉన్నట్లుండి తూర్పు జర్మనీపై ప్రేమ పుట్టుకొచ్చింది.

‘‘ఇలాగని తెలిస్తే, మనం ఇండియన్సుమని ముందే చెప్పేవాళ్లం. అప్పుడు పాస్‌పోర్టు కూడా చెక్ చేసేవారు కాదేమో!’’ అన్నాడు ప్రసాద్.

‘‘ఆఁ, అప్పుడు మనం నిజంగా ఇండియన్సుమో కాదో తెలుసుకుందుకు పాస్‌పోర్టు ఎలాగూ చెక్ చేసేవారు’’ అంది ప్రసాద్‌భార్య.

గుండు కారణంగా తనని అనుమానించడం కొంచెం అవమానంగా భావించాడతడు.

ఇలాంటి ఊహించని సమస్యలు కొన్నుంటాయి. వాటిని పదిమందితో పంచుకోవడం అవసరం.

మా ప్రసాద్ గురించి ఈ కథ తెలిసుంటే, ఆ తర్వాత నాలుగేళ్లకి మన తెలుగు క్రికెటర్ ఎంవీ నరసింహారావు ఇలాంటి సమస్య ఎదురవకుండా జాగ్రత్త పడి ఉండేవాడేమో!

అప్పట్లో నరసింహారావు ఫస్టు క్లాసు మ్యాచిల్లో ఓ వెలుగు వెలుగుతూ, బోలింగులో చంద్రశేఖర్ని మించిపోతాడా అనిపించుకున్నాడు. తెలుగు ప్రాంతం వారికి, ముఖ్యంగా పేరులో పూర్తి తెలుగుతనమున్నవారికి టెస్టు మ్యాచిల్లో అవకాశాలు అరుదు అనుకునే ఆ రోజుల్లో అతగాడు గవాస్కర్ కెప్టెన్సీలో దిగ్గజంలాంటి వెస్టిండీస్ టీం మీద ఆడే టీములోకి ఎంపికయ్యాడు.

తనకలాంటి అవకాశం కేవలం ప్రతిభ కారణంగా వచ్చిందని నరసింహారావుకే అనిపించనట్లుంది. ఆ అవకాశం శ్రీనివాసుడి కటాక్షమేనని నమ్మి వెంటనే తిరుపతి వెళ్లి గుండు చేయించుకుని వచ్చాడు.

గుండు రూపాన్ని పూర్తిగా మార్చేస్తుంది కదా!

అప్పటికే నరసింహారావుతో వ్యక్తిగతంగా కొంత పరిచయమున్న వెస్టిండీస్ టీం వాళ్లు – గుండుతో ఉన్న ఈ నరసింహారావు ఆ నరసింహారావేనని ఓపట్టాన ఒప్పుకోలేదని కొందరు క్రికెట్ వ్యాఖ్యాతలు అన్నారు.

ఆ తర్వాత అతణ్ణి బోలర్‌గా అతి తక్కువగానూ, బ్యాట్స్‌మన్‌గా ఎక్కువగానూ ఉపయోగించుకునే ప్రయత్నం చేసి, బ్యాట్స్‌మన్‌గా ఫెయిలయ్యాడని నిర్ధారించి, నాలుగే నాలుగు టెస్టు మ్యాచిలతో ఉద్వాసన చెప్పడం జరిగింది. చివరి టెస్టులో ఐతే, ఓటమి తప్పదనుకున్న పరిస్థితుల్లో – గవాస్కర్, విశ్వనాథ్, వెంగసర్కార్ వంటి ఉద్దండులు ఔటైపోయిన సందర్భంలో – ఆట చివరి బంతిదాకా ఓ పక్కనుండి మ్యాచిని డ్రాగా ముగించడానికి సహకరించాడు నరసింహారావు. ఐనా అతడికి ఉద్వాసన చెప్పడంలో రాజకీయముందని కొందరు కొన్నాళ్లు చెవులు కొరుక్కున్నారు. నరసింహారావు ఇప్పుడెందరికి గుర్తున్నాడో తెలియదు కానీ, అతడి తిరుపతి మొక్కు సంగతి మాత్రం నేను ఎప్పటికీ మరువలేను.

అదలాగుంచి మళ్లీ నాలుగేళ్లు వెనక్కొస్తే – ఊబాన్ స్టేషన్లోంచి అంతా బయటపడ్డాం.

దగ్గర్లోనే నడక దూరంలో అలెగ్జాండర్ ప్లాట్జ్ ఏరియా ఉంది.

ఆ ప్రాంతం వైభవంలో కళ్లు చెదిరేలా, పశ్చిమజర్మనీని తలదన్నేలా ఉంది.

ఎత్తైన భవంతులు, ఖరీదైన అలంకరణ.

అక్కడే సుమారు 370 మీటర్ల ఎత్తున్న ఫెరన్‌జేహె తుర్మ్ (టివి టవర్) ఉంది. అది మాకు పశ్చిమబెర్లిన్లో మేముండే చోటుకి కూడా చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

పైన సన్నగా పొడుగ్గా ఉండే యాంటెన్నా, మధ్యలో భూమికి సుమారు 200మీటర్ల ఎత్తులో రివాల్వింగ్ రెస్టారెంటు కూడా మేము రోజూ చుస్తూనే ఉంటాం.

ఆ రోజు ఆ టవర్‌ని దగ్గర్నుంచి చూడ్డం థ్రిల్లింగుగా అనిపించింది. ఫొటోలు తీసుకున్నాం.

అందులోని రివాల్వింగ్ రెస్టారెంటులాంటిది ప్రపంచంలో మరెక్కడా లేదని విన్నాం. వెళ్లి చూద్దామా అనిపించింది కానీ, పిల్లలతో కలిసి అంతెత్తు వెళ్లడానికి జంకు కలిగింది.

ప్రసాద్ కూడా, ‘‘టవర్ని చూశాం. అది చాలు’’ అన్నాడు.

కాసేపు ఆ చుట్టుపక్కల వైభవాన్ని చూసేక, ఓ పెద్ద భవంతి పక్కన చిన్న సందులోకి వెళ్లాం.

ఆ సందులో షాపులు, అంతవరకూ మేము చూసినవాటికి భిన్నంగా చిన్నగా ఉన్నాయి. బయట్నించి చూస్తే లోపలి వస్తువులు అనాకర్షణీయంగా పేదగా అనిపించాయి.

కుతూహలం కొద్దీ ఓ షాపులోకి వెడితే అక్కడి బొమ్మలు పూర్వం తిరునాళ్లలో అమ్మే చౌకరకం బొమ్మల్లా ఉన్నాయి. పిల్లలు కాసేపంటే కాసేపే ఆడుకుని పారేస్తారనిపించింది. పశ్చిమంలో అలాంటివి ఉంటే ఒక మార్కుకి రెండైనా ఇస్తారనిపించింది.

కేవలం గుర్తుగా ఉంటుందని ఓ బొమ్మ కొనాలనుకుని ధర అడిగాను.

సేల్సుగర్ల్ ముఖంలో ఉత్సాహం లేదు, కళ లేదు. ఏదో తప్పదన్నట్లు అనాసక్తంగా ధర చెప్పింది.

విని షాక్ తిన్నాను. అక్కడున్న ఏ బొమ్మా ఐదు మార్కులకి తక్కువ కాదు.

బహుశా ఆ ధర ఈస్ట్ జర్మన్ మార్కుల్లో అయుంటుందనుకుని, ''వెస్ట్ జర్మన్ మార్కుల్లో ఐతే ఎంత?'' అనడిగాను.

ఠక్కున బదులిచ్చిందా అమ్మాయి, ''మార్కంటే మార్కే. ఈస్టూ వెస్టని లేదు మాకు. ఎటొచ్చీ వెస్టైనా తీసుకుంటాం'' అంది అదేదో ఫేవర్ అన్నట్లు.

నాకు తెలుసు – వీళ్ల మార్కు కంటే నా మార్కుకి విలువెక్కువని. కానీ ఆ మాటనలేను కదా!

అక్కడికొచ్చినందుకు ధర గురించి పట్టించుకోకుండా ఇలాంటిదొకటి కొనాలని, చాయిస్ పిల్లలకిచ్చాం.

భువనేశ్వర్లో ఉన్నప్పుడు బయటికెప్పుడెళ్లినా పిల్లలకోసం ఏదో ఓ కొత్త బొమ్మో, ఆటవస్తువో కొనేవాళ్లం. అదెంత చవకదైనా సరే, పిల్లలు ఉత్సాహంగా తీసుకుని కాసేపు ఆడుకునేవారు.

ఇక్కడ మాత్రం ఏ బొమ్మా వాళ్లకి నచ్చలేదు.

''వాళ్లకిష్టం లేనప్పుడు – అంత ధర పెట్టి బొమ్మ కొనడమెందుకూ! టెంపరేచర్ ఇండికేటర్ కొనండి. ఉపయోగపడుతుంది, సోవనీరుగానూ ఉంటుంది'' అన్నాడు ప్రసాద్.

అలాగని అక్కడ కొనడానికి అంతకంటే మంచి వస్తువులు లేవని కాదు. బెర్లిన్లో అంతవరకూ మాకెదురైన అనుభవాలకి భిన్నంగా ఉన్న ఈ అనుభవానికి అదే సరైన గుర్తు అనిపించింది.

అలెగ్జాండర్ప్లాట్జ్లో దొరికేవన్నీ మాకు వెస్ట్ బెర్లిన్లోనూ దొరుకుతాయి మరి.

అప్పుడు శ్రీమతి, ''చిన్న సందులోకెడితేనే ఇంత తేడా ఉంది. కొంచెం ముందుకెళ్లి చూద్దామా?'' అంది.

నలుగురు పెద్దలు, ఇద్దరు పిల్లలు – అక్కణ్ణించి కాస్త బయటికెళ్లి చూస్తే –

ఒక్కసారి – జర్మనీనుంచి కుగ్రామానికి వచ్చినట్లుంది.

పాడుపడ్డట్లున్న రోడ్డు.

రోడ్డుపక్కన మొలిచిన పచ్చగడ్డి, పిచ్చిమొక్కలు. అక్కడక్కడ చెత్త కాగితాలు, గుడ్డపేలికలు....

దూరంగా భవనాలు కనిపిస్తున్నాయి. వాటిని చూస్తుంటే ఇండియాలో ట్రయిన్లో వెడుతున్నప్పుడు కనిపించే బొంబాయి నగర శివార్లలా అనిపించింది.

''పూర్వం పేద పంతుళ్లు – చిరుగుల చొక్కాని దాచుకుందుకు, పైన కోటు వేసుకుని బడికి వెళ్లేవారుట. అలెగ్జాండర్ ప్లాట్జ్ ఆ కోటులా ఉంది'' అన్నాను అప్రయత్నంగా.

''తూర్పు జర్మనీ పేద దేశమేం కాదు. స్వయంకృషిలో, ప్రతిభలో ఇక్కడి పౌరులు పశ్చిమంవారికేం తీసిపోరు. ఐతే వైభవ ప్రదర్శన నచ్చని వ్యవస్థలో భాగమవడం వల్ల ఇలా ఉన్నారనుకుంటాను'' అన్నాడు ప్రసాద్ సాలోచనగా.

''అది నిజమే కానీ నాకో విషయం అర్థం కావడం లేదు. వైభవ ప్రదర్శన నచ్చనప్పుడు అలెగ్జాండర్ప్లాట్జ్ని అలా కళ్లు చెదిరిపోయేలా ఎందుకు రూపొందించినట్లు?'' అన్నాను.

''అది యాత్రీకులు వచ్చి చూసిపోయే ప్రదేశం'' అన్నాడు ప్రసాద్ చటుక్కున.

అతడి సమాధానం చాలా లోతైనదనిపించింది.

తూర్పు జర్మనీ ఒక వ్యవస్థని అనుసరిస్తూ, తన పౌరులమీద ఆ వ్యవస్థను రుద్దింది. ఆ వ్యవస్థని యాత్రీకుల ముందు గర్వంగా ప్రదర్శించాలని అనుకోలేదు.

ఇతరులముందు గొప్పగా చెప్పుకోలేని వ్యవస్థని తన పౌరులపై రుద్దడమెందుకు?

''ఒక్కమాటలో చాలా గొప్పగా చెప్పారు'' అన్నాను ప్రసాద్‌ని మెచ్చుకుంటూ.

అతడు నవ్వి, ''ఇందాకా మీరు అలెగ్జాండర్‌ప్లాట్జ్‌ని – చిరుగుల చొక్కాని దాచుకుందుకు పేదవాడు వేసుకున్న కోటుతో పోల్చారే, అదే నేను ఇంకోలా చెప్పాను'' అన్నాడు.

ఐతే – ఏ దృశ్యాన్నయినా కళ్లొకలా చూస్తే మెదడు మరొకలా చూస్తుందని – ఆ తర్వాత భువనేశ్వర్ కొలీగ్ భూషణ్ మా ఇంటికొచ్చినప్పుడు గ్రహించాను.

స్నేహానంద లహరి

జర్మనీ రెండు భాగాలై రెండు వేర్వేరు దేశాలుగా ఉంటున్న రోజులవి.

జర్మన్లకి బెర్లిన్ ప్రతిష్ఠాత్మక నగరం. దేశం విడిపోక తప్పని పరిస్థితుల్లో కూడా, ఇరు దేశాలూ ఆ నగరాన్ని వదులుకుందుకు సిద్ధంగా లేవు. అందుకే దేశంతో పాటు ఆ నగరమూ రెండు ముక్కలైంది.

జర్మనీకి సంబంధించి ఆ నగరానికి ఇంత ప్రాముఖ్యమున్నదని నాకు తెలియదు. రీసెర్చిలో నేనెంచుకున్న అంశాన్ని ఆమోదించిన ప్రొఫెసరు పనిచేసే సంస్థ వెస్ట్‌బెర్లిన్లో ఉన్నది కాబట్టి నేనక్కడికి వచ్చాను.

జర్మన్ భాష నేర్చుకుందుకు ల్యూనబర్గు గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో ఉండగా మమ్మల్ని అక్కడకు ఆహ్వానించిన డాడ్ సంస్థ బెర్లిన్ ప్రాముఖ్యం గురించి తెలియబరుస్తూ ఓ ఉత్తరం వ్రాసింది.

అప్పుడక్కడ ఉన్న భారతీయుల్లో బెర్లిన్ వెడుతున్నది నేనొక్కణ్ణే కావడంతో – మిగతావాళ్లు నా అదృష్టాన్ని అభినందించారు.

ఐతే ఆ ఉత్తరంలోనే మరో విషయముంది.

బెర్లిన్లో కాకుండా, జర్మనీలో ఇతర నగరాల్లో రీసెర్చి కొనసాగించే వారందరికీ స్వదేశానికి తిరిగి వెళ్లేలోగా, డాడ్ సంస్థ స్వంత ఖర్చులమీద బెర్లిన్ నగరవిహార భాగ్యం కల్పిస్తుంది.

ఆమేరకు మిగతావాళ్లకి అదనపు సౌకర్యం కలిగినట్లే కదా!

బెర్లిన్లోనే ఉన్నవాళ్లకి మిగతా దేశమంతా చూపించే కార్యక్రమం కూడా ఉంటే బాగుండేదనిపించింది.

అక్కడి ఇండియన్ మిత్రులు మాత్రం, ''మాకు సంబంధించి, బెర్లిన్ నగర విహారంలో అన్నింటినీ మించి నిన్ను చూడ్డమే ముఖ్యం. మేమంతా నిన్నక్కడ కలుసుకుంటాం'' అన్నారు అభిమానంగా.

నేనేదో అనేలోగా, ''ఆతిథ్యం గురించి బెంగెట్టుకోకు. జస్ట్ చూడ్డమే ముఖ్యం'' అని హామీ ఇచ్చాడు నా మిత్రుల్లో ముఖ్యుడు నటరాజన్.

''ఇక్కడి మిత్రులందరికీ ఆతిథ్యమివ్వగల అదృష్టం నాకు మాత్రమే కలుగుతుంటే, బెంగెందుకు? మీకోసం నా ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి'' అన్నాను.

''అది తెలియక కాదు. ఇక్కడికొచ్చి మేమంతా కుకింగ్ స్కిల్స్ నేర్చుకున్నాం. నీ ఇంట్లో వంట సదుపాయం లేకపోవడంవల్ల, నీకలాంటి అవకాశం రాలేదుగా. అందుకని అలాగన్నాను. నీ ఇంటి తలుపులు తెరిచుంటాయని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు'' అన్నాడు నటరాజన్.

''చెప్పాలి. ఎందుకంటే ఇక్కడ మన దేశంలోలా కాదు. ఇళ్ల తలుపులు ఎల్లప్పుడూ మూసే ఉంటాయి. తలుపులు మూసినా తెరచి ఉన్నట్లు గ్రహించడానికే నా ఈ ఆహ్వానం'' అన్నాను.

నేను బెర్లిన్లో ఉండగా ల్యూనబర్గ్ మిత్రులు మాత్రమే కాదు, ఇండియన్ మిత్రులు మరికొందరు కూడా నన్ను చూడ వచ్చారు. ఆ సందర్భంలో పంచుకోవాలనిపించే కొన్ని విశేషాల్ని మాత్రం ఇక్కడ ప్రస్తావిస్తాను.

ముందుగా భువనేశ్వర్ మిత్రుడు భూషణ్ రాకని ప్రస్తావిస్తాను.

నా జర్మనీ ప్రయాణంలో ఇండియాలో స్కాలర్‌షిప్ ఇంటర్వ్యూ దగ్గర్నుంచీ నాతో ముడిపడ్డవాడు భూషణ్. జర్మనీ చేరేక భాష నేర్చుకుందుకు నేను ల్యూనబర్గ్‌కి వెడితే అతడు మరో ఊరికి వెళ్లాడు.

భూషణ్ బెంగాలీ హిందూ. పుట్టింది ఢాకా నగరంలో. నాలుగేళ్లపాటు బాల్యం అక్కడే గడిచిందనుకుంటాను. 1947లో భారత దేశం రెండు ముక్కలై పాకిస్తాన్ కొత్త దేశంగా ఆవిర్భవించినప్పుడు – ఢాకా నగరం తూర్పు పాకిస్తాన్లో భాగమవడంతో అతడి కుటుంబీకులు కలకత్తాకు తరలి వెళ్లారు.

బెంగాలీలకి కలకత్తా అంటే పిచ్చి. భూషణ్‌కీ కలకత్తా అంటే అంతిష్టమూ ఉన్నా, పుట్టినూరైన ఢాకానీ బాగా ఇష్టపడేవాడు. ఇండియాలోని ఇతర నగరాలతో పోల్చి ఢాకాని తెగ మెచ్చుకునేవాడు. 1971లో తూర్పు పాకిస్తాన్ తన ఉనికి కోల్పోయి బంగ్లాదేశ్‌గా అవతరించేక అతడు ఢాకాలో వస్తున్న మార్పుల్ని శ్రద్ధగా గమనించేవాడు. అక్కడ అతడికి బంధుమిత్రులున్నారు. విశేషమేమంటే, అతడికి హిందువులంటే ప్రత్యేకాభిమానం లేదు. ముస్లిములంటే వైరభావమూ లేదు. నాకతడు ఆదర్శ భారతీయుడనిపించేది.

భూషణ్‌ది విభిన్న వ్యక్తిత్వం.

తనకి నచ్చినవి అందరికీ నచ్చాలంటాడు. తనకి నచ్చనివి ఇతరులకి ఎలా నచ్చాయా అని ఆశ్చర్యపోతాడు. అన్నింటికీ తనవైపునుంచే ఆలోచిస్తూ. ఎదుటివారి అవసరాల్ని గ్రహించడు.

''నాకులా మారకపోతే, జర్మనీలో పట్టుమని పది రోజులుండలేవు'' అని నన్ను పలుమార్లు మందలించాడు.

నన్నతడు తరచుగా సతాయించడం, ఆ సతాయింపు వెనుకనున్న ఆత్మీయతనీ, నిబద్ధతనీ ఆలస్యంగానైతేనేం నేను గ్రహించడం – కౌముదిలోనే ఈ సీరియల్ ఆరంభంలో 'ఫారిన్ వెళ్లాలండి' విభాగంలో వివరించాను.

జర్మనీ చేరుకున్నాక మా మధ్య కొన్ని ఉత్తరాలు నడిచాయి.

తను వ్రాసేవాడు కాదు. నేనుత్తరం వ్రాస్తే తను బదులిచ్చేవాడు.

ఆ ఉత్తరాల్ని బట్టి – భూషణ్‌కి అక్కడి తిండి, అలవాట్లు, మితిమీరిన స్వేచ్ఛ, వైభోగం వగైరాలేం నచ్చలేదని అర్థమై ఆశ్చర్యపడ్డాను. ఎందుకంటే, ల్యూనబర్గ్‌లో పరిచయమైన బెంగాలీ మిత్రుడు బిశ్వాస్‌కి, ఇక్కడ ప్రతీదీ తెగ నచ్చేసింది. ''మా బెంగాలీల అలవాట్లకి ఇదో ఆదర్శదేశం'' అని తానిక్కడ పుట్టనందుకు వాపోయేవాడు.

భూషణ్ అందుకు పూర్తిగా భిన్నం.

అతడికి తనుండే సంస్థలో కొలీగ్సుతో అంతగా పడలేదుట. అతడి ప్రాజెక్టు నచ్చిన ప్రొఫెసరు – స్కాలర్‌షిప్ గడువు కాలాన్ని మరో ఏడాదికి పొడిగించుకోమన్నాట్ట. కానీ, గడువు తేదీకి మించి ఒక్క సెకనైన ఇక్కడుండడట.

నిజానికతడికి మధ్యలో వదిలేసి ఇండియా వెళ్లిపోవాలనుందిట. కానీ, అది తన కెరీర్‌కి మచ్చ ఔతుందని భయపడుతున్నాడుట. ఎలాగో ముక్కు మూసుకుని రోజులు గడిపేస్తాట్ట.

జర్మనీ పట్ల భూషణ్ స్పందన నాకు ఆశ్చర్యం కలిగించింది.

మాంసాహారి. పరిమితంగా ఆల్కహాలు తీసుకుంటాడు. సంప్రదాయాన్ని వ్యతిరేకించడు కానీ, అనుసరించడం పట్ల ఆసక్తి లేదు. రీసెర్చి అంటే ప్రాణం పెడతాడు.

ఇలా అన్ని విధాలా అతడికి జర్మనీ చాలా ఎక్కువగా నచ్చాలి. కనీసం నాకంటే ఎక్కువ నచ్చాలి.

నాకేమో జర్మనీ తెగ నచ్చేసింది. భూషణ్‌కి బొత్తిగా నచ్చలేదు.

నేనతణ్ణి కారణాలడగలేదు. అతడ వ్యక్తిత్వపు విభిన్నతలో ఇదీ ఓ భాగమనుకున్నాను.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments